సైన్స్ పరీక్షకు 12 పేజీల బుక్‌లెట్లు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈనెల 13న జరగబోయే పదో తరగతి సైన్స్ పరీక్షకు 12 పేజీలు బుక్లెట్లను అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ డి వి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని 10వ తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న అన్ని కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టెమెంట్ ఆఫీసర్లు గమనించాలని తెలిపారు. 12 పేజీలు కలిగిన రెండు సమాధాలు గల బుక్‌లెట్లు పరీక్షకు హాజరవుతున్న విద్యార్ధులకు ఇవ్వవాలని సూచించారు. భౌతిక, జీవ శాస్త్రాలకు సంబంధించి చెరో 12 పేజీల సమాధానాల బుక్‌లెట్లు విడివిడిగా విద్యార్థులకు అందించాలన్నారు. ఆ రెండు సమాధానాల బుక్‌లెట్లకు సంబంధించి ఒఎంఆర్‌ను వేటీవి వాటికి వేర్వేరుగా జత చేయాలని సూచించారు.

విద్యుత్ ఛార్జీలపై టిడిపి నిరసనలు

ప్రజాశక్తి - జియ్యమ్మవలస

పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని, వ్యవసాయ రంగంలో స్మార్ట్ మీటర్లు బిగించకూడదని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి ఆధ్వర్యాన ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్సీ శత్రుచర్ల విజయరామరాజు మాట్లాడుతూ రైతుల ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటూ రైతాంగంపై భారాలు మోపే విద్యుత్ విధానాలను ప్రభుత్వం తీసుకువస్తుందని, ప్రతిఏటా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ ప్రజల నెత్తిన భారాలు మోపుతున్నారని విమర్శించారు. సర్‌ఛార్జీల పేరుతో అదనపు భారాలను కూడా వేస్తూ విద్యుత్ ఛార్జీలు పెంచుతున్నారని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్ అంటూ స్మార్ట్ మీటర్లను బిగిస్తున్నారని, దీనివల్ల భవిష్యత్తులో రైతాంగం అవస్థలు ఎదుర్కొనే ప్రమాదం ఉందని హెచ్చరించారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలు పెంపును ప్రభుత్వం విరమించుకోవాలని, లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోవల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అరకు పార్లమెంటు అధికారి ప్రతినిధి డి.రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్, రైతు సంఘం నాయకులు గురాన శ్రీరామ్మూర్తి, ఎన్.కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు

కురుపాం : విద్యుత్ ఛార్జీలు తక్షణమే తగ్గించాలని టిడిపి నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి ఆధ్వర్యాన స్థానిక టిడిపి కార్యాలయం నుండి విద్యుత్ కార్యాలయం వరకు ర్యాలీ గా వెళ్లి వినూత్న రీతిలో మెడకు ఉరుతాలు బిగించుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొలాలకు స్మార్ట్ మీటర్లు బిగించడం అంటే రైతుల మెడకు ఉరితాళ్లు బిగించినట్టేనని, అలాగే ఇప్పటికి ఏడు సార్లు విద్యుత్ చార్జీలు పెంచి పేదలపై పెనుభారం వైసిపి ప్రభుత్వం మోపిందని విమర్శించారు. వెంటనే పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని లేకుంటే పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, మాజీ సర్పంచ్ కిమిడి రామరాజు, టిడిపి నాయకులు వి.భారతి, కళావతి, వెంకటరావు, రమేష్, శ్రీను, చంటి, బోటు గౌరి,అజిత్, మల్లేషు, వాసు, ధర్మా, సుబ్బలక్ష్మి, దుర్గా, మహేష్, గవరయ్య, త్రినాథ, శరత్, చిరు, కలిసెట్టి శ్రీను, రామకష్ణ తదతరులు పాల్గొన్నారు

సాలూరు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యుత్ కోతలకు నిరసనగా సోమవారం టిడిపి ఆధ్వర్యాన ఆపార్టీ నాయకులు కార్యకర్తలు తహశీల్దార్ కార్యాలయం జంక్షన్‌లో ధర్నా చేపట్టారు. నియోజకవర్గ ఇంఛార్జి జి.సంధ్యారాణి ఆధ్వర్యాన నిర్వహించిన ధర్నా ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఒక వైపు ఎడాపెడా విద్యుత్ ఛార్జీలు పెంచుతూ మరోవైపు కోతలు అమలు చేయడం దారుణమని అన్నారు. పెంచిన ఛార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు నిమ్మాది తిరుపతిరావు, మండల అధ్యక్షులు ఆముదాల పరమేష్, పాచిపెంట, మక్కువ మండలాల అధ్యక్షులు ముఖి సూర్యనారాయణ, జి.వేణుగోపాలరావు, అర్బన్ బ్యాంక్ మాజీ అధ్యక్షులు కూనిశెట్టి భీమారావు పాల్గొన్నారు.

పార్వతీపురం రూరల్ : విద్యుత్‌ఛార్జీల పెంపునకు నిరసనగా నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి బొబ్బిలి చిరంజీవులు ఆధ్వర్యంలో స్థానిక ఎపిఇపిడిసిఎల్ ఇఇ కార్యాలయం ఎదుట నిరసన నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్న ఐదేళ్లలో ఒక్కసారి కూడా అదనపు విద్యుత్ చార్జీలు ఒక రూపాయి కూడా పెంచకుండా మిగులు విద్యుత్తును సాధించగలిగామని, అధికారంలోకి వచ్చిన వెంటనే వైసీపీ రివర్స్ టెండరింగ్ పేరిట విద్యుత్ ఒప్పందాలకు మంగళం పాడి అధిక రేట్లకు విద్యుత్తుకొని కమీషన్లు దండుకుందని ఆరోపించారు. అస్తవ్యస్త పరిపాలనతో ప్రజల నడ్డి విరగదీస్తున్న జగన్ పీడ ఎప్పుడు విరగడవుతుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని, ఆ రోజు కూడా ఎంతో దూరం లేదని ఆయన అన్నారు. కార్యక్రమంలో పట్టణ, మండల టిడిపి అధ్యక్షులు జి.రవికుమార్, డి.మోహనరావు, నాయకులు జి.వెంకటనాయుడు, ఉదయభాను, బోను చంద్రమౌళి, ప్రదీప్, రవికుమార్, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండల టిడిపి అధ్యక్షులు కొల్లి తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ నాయుడు ఆధ్వర్యంలో అప్పయ్యపేట విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. నిరుపేద, పేద, మధ్యతరగతి ప్రజలపై ప్రభుత్వం విద్యుత్ చార్జీలు పెంచి భారం వేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా పెంచిన ధరలను తగ్గించుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెదబోగిలి, రామవరం సర్పంచులు జొన్నాడ తేరేజమ్మ, పెంట సత్యం నాయుడు, క్లస్టర్ ఇంఛార్జులు బొమ్మినేని లక్ష్మణరావు, బుడితి శ్రీనివాసరావు, కొల్లి సురేష్, కర్రి శంకర్రావు, మర్రాపు యోగేశ్వరరావు, జక్కు పకీరునాయుడు యాల రామినాయుడు, జక్కు పకీర్‌నాయుడు, ఉడమల సూర్యనారాయణ, నడగాన వెంకయ్య, నడిమింటి ధనంజయ, లబ్బ శ్రీనివాసరావు, సబ్బాన శ్రీనివాసరావు, చింతాడ సత్యం, పెంట ఉమా, రెడ్డి సింహాచలం తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎఇ కోట్ల సోమేశ్వరరావుకు వినతి పత్రాన్ని సమర్పించారు.

కురుపాం : మెడకు ఉరితాళ్లు బిగించుకొని నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

సీతంపేట : స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మండల టిడిపి అధ్యక్షులు సవరతోట ముఖలింగం మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ ఛార్జీలు వెంటనే తగ్గించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మాజీ జెడ్పిటిసి రాజబాబు, మాజీ సర్పంచ్ దమయంతినాయుడు, తదితరులు పాల్గొన్నారు

బలిజిపేట : మండలంలోని చిలకలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద టిడిపి మండల అధ్యక్షులు పెంకి వేణుగోపాలనాయుడు, సీనియర్ నాయకులు వాడాడ రాము ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా ధర్నా చేశారు. విద్యుత్ ఛార్జీలు తగ్గించని పక్షంలో ఆందోళనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఎం.అప్పారావు, రాధాకృష్ణ, నారాయణరావు, జగన్మోహనరావు, పెంకి రామ్మోహనరావు, క్లస్టర్ ఇంచార్జ్ జి.బాబ్జి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాలకొండ : విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ సోమవారం విద్యుత్ శాఖ ఎడి కార్యాలయం ముందు టిడిపి నాయకులు నిరసన తెలియజేశారు. ఈ సంతదర్భంగా టిడిపి రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై పెనుభారాలు వేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు గండి రామినాయుడు, గంటా సంతోష్, సుంకరి అనీల్, ధనుంజయ్, అంపోలు శ్రీను, బెవర శ్రీను తదితరులున్నారు.

పార్వతీపురం, బలిజిపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

ఉత్తరాంధ్ర ప్రజల కల

త్వరలో నెరవేరుస్తాం

- భోగాపురం ఎయిర్‌పోర్టు శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు
- ఐటి, పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్
- విమానాశ్రయ భూములను పరిశీలించిన మంత్రి

ప్రజాశక్తి-భోగాపురం

ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి, మే 3వ తేదీన శంకుస్థాపన చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి నిర్ణయించారని, రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, మౌలిక వసతుల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్ వెల్లడించారు. ఈ విమానాశ్రయ నిర్మాణం ద్వారా, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల వాంఛ నెరవేరుతుందని పేర్కొన్నారు. భోగాపురం విమానాశ్రయ నిర్మాణానికి సేకరించిన భూములను మంత్రి అమర్‌నాథ్ సోమవారం సందర్శించారు. ట్రంపెట్ రహదారి నిర్మాణం జరిగే ప్రదేశాన్ని, ముఖ్యమంత్రి నిర్వహించే భారీ బహిరంగ సభ ప్రదేశాలను ఆయన పరిశీలించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంఎల్‌ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో, అంతకుముందు సన్‌రే రీసార్ట్‌లో సమావేశాన్ని నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన భూ సేకరణ ప్రక్రియను తెలుసుకున్నారు. శంకుస్థాపన, ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లపై అధికారులు, నాయకులతో చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి అమర్‌నాథ్ మీడియాతో, భోగాపురం విమానాశ్రయ నిర్మాణాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా భావిస్తోందని చెప్పారు. ఉత్తరాంధ్ర ప్రజల సుదీర్ఘ స్వప్నం నెరవేరే రోజు ఆసన్నమయ్యిందన్నారు. శంకుస్థాపన జరిపేందుకు అవసరమైన అన్ని రకాల లాంఛనాలను పూర్తి చేశామని చెప్పారు. సుమారు 2,200 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమయ్యే ఈ ఎయిర్‌పోర్టుకు, ఇప్పటికే దాదాపు 2,195 ఎకరాల భూసేకరణ పూర్తి అయ్యిందని, మిగిలిన కొద్దిపాటి భూ సేకరణ కూడా త్వరలో పూర్తి కానుందని తెలిపారు. ఏ ఒక్కరికీ ఇబ్బంది కలగకుండా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని చెప్పారు. శంకుస్థాపన అనంతరం 24 నుంచి 30 నెలల్లో విమానాశ్రయ నిర్మాణం పూర్తి అవుతుందని చెప్పారు. ఈ సందర్భంగా భారీ భహిరంగ సభను నిర్వహించనున్నట్లు మంత్రి వెల్లడించారు. పర్యటనలో జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎంఎల్‌ఎ బడ్డుకొండ అప్పలనాయుడు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలెవన్, మారిటైమ్ బోర్డు ఛైర్మన్ కెవి రెడ్డి, జెసి మయూర్ అశోక్, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, జిఎంఆర్ సిఇఒ మన్మయ్, రామరాజు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎయిర్‌పోర్టు భూములను పరిశీలిస్తున్న మంత్రి అమర్‌నాథ్

బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

ప్రజాశక్తి - కురుపాం

నేల బావిలో పడి ఇద్దరు చిన్నారులు మృతి చెందిన సంఘటన మండలంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే నీలకంఠాపురం పంచాయతీ పెద్దగూడకు చెందిన ఊయక మల్లేష్ కుమారుడు సందీప్ (5), ఆరిక ధనుంజయరావు కుమారుడు సబిస్టియన్ (4) ఆడుకుంటుండగా బావిలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే నీకలంఠాపురం పిహెచ్‌సికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. అనంతరం మృతదేహాలను స్వగ్రామానికి తీసుకెళ్లిపోయారు. చిన్నారుల మృతితో పెద్దగూడలో విషాదఛాయలు అలముకున్నాయి.

12న పార్వతీపురంలో జాబ్ డ్రైవ్

ప్రజాశక్తి - కలెక్టరేట్

ఈనెల 12న ఉదయం 10 గంటల నుంచి స్థానిక ఎస్‌వి గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో జాబ్ డ్రైవ్ జరుగుతుందని ఎపిఎస్‌ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ వారి ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా ఇంటర్, బిఎస్‌సి (కెమిస్ట్రీ), బి-ఫార్మసీ, డిప్లొమా (మెకానికల్) కోర్సుల్లో (2020, 2021, 2022, 2023 సంవత్సరంలో) ఉత్తీర్ణత సాధించి 18 నిండి 26 ఏళ్ల మధ్య వయసు గల నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. ఈ డ్రైవ్‌కు అరబిందో ఫార్మసీ ప్రతినిధులు హాజరై అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకుంటారని తెలిపారు. కావున ఆసక్తి కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు తమ వివరాలను www.apssdc.in వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకొని రిఫరెన్స్ నెంబర్‌తో పాటు రెస్యూమ్, ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికేట్లు, ఒరిజినల్, జెరాక్స్, 1 పాస్‌ఫోర్టు సైజ్ ఫోటోతో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు 9494304400, 7780334777ను సంప్రదించాలని సూచించారు.

9 మంది గైర్హాజరు

వీరఘట్టం : స్థానిక జిల్లా పరిషత్తు బాలికల ఉన్నత పాఠశాల పరీక్షా కేంద్రంలో సోమవారం నిర్వహించిన ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షకు 9 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరిం టెండెంట్ డి. నాగమణి తెలిపారు. 176 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావలసి ఉండగా 9 మంది హాజరు కాలేదని ఆమె తెలిపారు.

స్పందన వినతులకు తక్షణ పరిష్కారం

ప్రజాశక్తి - కలెక్టరేట్

స్పందన కార్యక్రమానికి వచ్చే వినతులను ఆయా శాఖల అధికారులు తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఐటిడిఎ పిఒ, డిఆర్‌ఒ జె.వెంకట్రావు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 80 దరఖాస్తులు స్పందన కార్యక్రమంలో అందాయి.అర్జీలు వివరాలిలా ఉన్నాయి...

కొమరాడ మండలం రాయపురంలో శ్మశానా వాటికలకు వెళ్లే రహదారులు ఆక్రమణకు గురయ్యాయని, దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, కావున సమస్య పరిష్కరించాలని హెచ్.సురేష్ కుమార్, గ్రామస్తులు వినతిని అందజేశారు. పార్వతీపురం మండలం చుక్కవానివలసలో జిరాయితీ భూమిని సాగు చేస్తున్నామని ఆ భూములకు సర్వే జరిపించి ఆన్లైన్లో నమోదు చేయించి 1బిలు ఇప్పించాలని చుక్క.బోడయ్య, ఇతరులు వినతి పత్రం సమర్పించారు. పాచిపెంట మండలం మోసూరులో బిఆర్ అంబేద్కర్ సామాజిక భవనం (కమ్యూనిటీ హాల్)ను మంజూరు చేయారు చేయాల్సిందిగా సర్పంచ్ జి.చంటి, గ్రామస్తులు కోరారు. అలాగే పెద్ద బుచ్చమ్మ చెరువుకు పెద్దగెడ్డ ప్రాజెక్ట్ నుంచి రెండు మదుముల ద్వారా నీరు వస్తుందని, ప్రస్తుతం ఇవి మూసుకుపోవడంతో నీరు రావడంలేదని, కావున కొత్త మదుములు నిర్మించడానికి నిధులు మంజూరు చేయాల్సిందిగా ఎంపిటిసి సభ్యులు కె.లక్ష్మి, రైతులు అర్జీ అందజేశారు. గుమ్మలక్ష్మీపురం మండలం గోయిపాకకు చెందిన కె.ఫిలిప్‌కుమార్ దేరువాడ నుండి బీరుపాడు వరకు రోడ్డు మరమ్మతులు పూర్తి చేయాలని కోరారు. అలాగే ఒంగ్రుబంగికు రోడ్డు సదుపాయం లేదని, దీంతో అత్యవసర పరిస్థితుల్లో డోలి తప్ప వేరే మార్గం లేదని, కావున చాపరాయి, జంగిడి భద్ర నుండి తమ గ్రామం వరకు బిటి రోడ్ మంజూరు చేయవలసిందిగా ఎం.రమేష్, ఇతరులు దరఖాస్తు అందజేశారు. గాంద్ర గ్రామానికి చెందిన ఎన్.అప్పారావు వికలాంగుల పెన్షన్ మంజూరు చేయాలని కోరారు. పార్వతీపురం మండలం కొత్తవలసకు చెందిన పి.విజయలక్ష్మి పిఎం కిసాన్, రైతు భరోసా మంజూరు చేయాల్సిందిగా కోరారు. మక్కువ మండలం శంబరకు చెందిన టి.తాతయ్య వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని, సీతానగరం మండలం బూర్జకు చెందిన ఎ.చిన్నమ్మనాయుడు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. కార్యక్రమంలో పలుశాఖలకు చెందిన జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు వింటున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

12న వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం

ప్రజాశక్తి- కలెక్టరేట్

వైఎస్‌ఆర్ ఇబిసి నేస్తం పథకం కింద ఆర్థిక సహాయం అందించే కార్యక్రమాన్ని ఈనెల 12న నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల సేవా సహకార సంఘం కార్య నిర్వాహక సంచాలకులు, ఆర్.గడ్డెమ్మ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వైఎస్‌ఆర్ ఇబిసి. నేస్తం" పథకం కింద 45 నుంచి 60ఏళ్ల మధ్య వయస్సు గల ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణ కులాల మహిళలకు రూ.15వేలు చొప్పున రెండో విడత (2022-23) కింద జిల్లాకు చెందిన 1370 మహిళా లబ్దిదారులకు రూ.2.055 కోట్లు ఈనెల 12న నేరుగా లబ్దిదారులు బ్యాంకు ఖాతాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి జమ చేస్తారని చెప్పారు. జిల్లా స్థాయిలో ప్రత్యక్ష ప్రసార కార్యక్రమం అదేరోజున కలెక్టర్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసినట్టు పేర్కొన్నారు.

నేడు రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యుల పర్యటన

కలెక్టరేట్ : జిల్లాలో మంగళ వారం రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు పర్యటిస్తారని జిల్లా సరఫరా అధికారి కెవిఎల్‌ఎన్ మూర్తి తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటన అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహిస్తారని తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆహార కమిషన్ సభ్యులు ఉదయం 9.30 గంటలకు పార్వతీపురం చేరుకుంటారని ఆయన చెప్పారు.

మళ్లీ రోడ్డెక్కిన ఎన్‌కె రాజపురం వాసులు

- మూడు గంటల పాటు రోడ్డు దిగ్బంధం
- చంద్రరావు మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి-పాలకొండ/పాలకొండ రూరల్

పట్టణంలో ఎన్.కె.రాజపురం ప్రాంతంలో చంద్రరావు మృతికి కారణమైన వారిని అరెస్టు చేయాలని కోరుతూ ఈ నెల 9న పోలీసుస్టేషన్ ఎదుట నిరసన తెలిపిన సంగతి తెలిసిందే. సోమవారం కూడా చంద్రరరావు మృతదేహంతో పాలకొండ సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు కొనసాగించారు. 3 గంటల పాటు ఆందోళన చేపట్టి రోడ్డుపై బైఠాయించి వాహన రాకపోకలను అడ్డుకున్నారు. మృతికి కారణమైన వారిని అరెస్టు చేయకుండా మృతుడు కుటుంబంలో ఉన్న వారిపై తప్పుడు కేసు పెట్టడం ఏమిటని పోలీసులను నిలదీశారు. మృతుడు ఇంటిపై కూడా వారు దౌర్జన్యానికి పాల్పడి నగదు, బంగారు వస్తువులు పట్టుకుపోయారని, దానిపై కూడా ఇంతవరకు పోలీసులు పట్టించుకోలేదని ఆరోపించారు. నాలుగు రోజులు క్రితమే సంఘటన జరిగినా ఇంతవరకు పోలీసులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రోడ్డుపై బైఠాయించి వాహన రాకపోకలు అడ్డుకుంటే నేరమని కేసులు నమోదు చేస్తామని పోలీసులు అనడంతో దానిపై నిరసన కారులు ఒక్కసారిగా కోపోద్రిక్తులయ్యారు. న్యాయం కోసం వచ్చిన వారిపై కేసులు పెట్టి హత్యచేసిన వారిని విడిచిపెట్టడమేమిటని ఇదెక్కడి న్యాయమంటూ పోలీసులను నిలదీశారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేపట్టారు. దీంతో డిఎస్‌పి కృష్ణారావు అక్కడకు చేరుకుని నిరసన కారులతో మాట్లాడారు. తమకు న్యాయం చేసేవరకు ఆందోళన కొనసాగిస్తామని నిరసన కారులు చెప్పగా డిఎస్‌పి వారిని శాంతింప చేశారు. తప్పకుండా ఈ విషయంలో న్యాయం చేస్తామని, మృతికి కారణమైన వారందరిపై కూడా కేసులు నమోదు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో వారు వెనుదిరిగారు.

రోడ్డుపై బైఠాయించిన ఎన్‌కె రాజపురం గ్రామస్తులు

ఎందుకీ జాప్యం

చంద్రరావుపై దాడి జరిగి నాలుగు రోజులు కావస్తున్నా ఇంతవరకు పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఎందుకు ఈ జాప్యం చేస్తున్నారో తెలియడం లేదు. కనీసం దాడిచేసిన వారిని విచారణ కూడా చేయడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నెల 9వ తేదీన పోలీసుస్టేషన్ ఎదుట తీవ్రస్థాయిలో ఆందోళన జరిగినా పోలీసు అధికారులు చలించలేదు. దీంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అంతేకాకుండా మృతుడి బంధువుపై కేసు నమోదు చేస్తామని పోలీసులు చెప్పడంతో స్థానికుల్లో పలు అనుమానాలకు దారితీస్తుంది. ఆ ప్రాంతానికి చెందిన అధికార పార్టీకి చెందిన ఒక నేత ఈ కేసు విషయంలో ఇరువురుని రాజీ చేయాలని జోరుగా ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రధాన కూడళ్లలో పశువులు సంచారం

- నియంత్రించాలని కలెక్టర్ ఆదేశాలిచ్చి ఏడాది
- చొరవ చూపని మున్సిపల్ అధికారులు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

పట్టణ ప్రధాన రహదారిలోని పలు కూడళ్లలో పశువుల సంచారంతో వాహనచోదకులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాది ఏప్రిల్ 4న పార్వతీపురం మన్యం జిల్లా ఏర్పడి తర్వాత మొట్ట మొదటి కలెక్టర్‌గా నిశాంత కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన సైకిల్ తొక్కుకుంటూ పార్వతీపురం ప్రధాన రహదారితో పాటు, పలు వార్డులను పరిశీలించారు. అందులో ఆయన గుర్తించిన ప్రధాన సమస్యలు పట్టణ రహదారిలో పశువుల సంచారాన్ని నియంత్రించాలని, జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అయితే అధికారులు ఆ ఆదేశాలను కొన్ని రోజులే పాటించారు. ఆ తర్వాత ఆ ఆదేశాలు గాలికి వదిలేశారు. ప్రధాన రహదారిపై వీటి నియంత్రణకు పాలక పక్ష కౌన్సిల్ సభ్యులు కూడా చొరవ చూపకుపోవడం గమనార్హం. కలెక్టర్ ఆదేశాలిచ్చి ఏడాదైనా ఈ సమస్య అలాగే ఉంది తప్ప పరిష్కార దిశగా అధికారులు అడుగులు వేయకపోవడంతో పశువుల యజమానులు బరితెగించి ఉదయాన్నే వీటి పాలు తీసుకుని ప్రధాన రహదారి పైకి వదిలి సాయంత్రం ఇంటికి తీసుకువెళ్లి మళ్లీ రోడ్డుపైనే వదిలి వేస్తున్నారు. దీంతో రాత్రీ పగలు అన్న తేడా లేకుండా రోడ్లపైనే తిష్ట వేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో పశువులు రోడ్లపై పొట్లాడుకోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహన చోదకులు పలు సందర్భాలలో ప్రమాదాల బారిన పడి గాయాలపాలవుతున్న సంఘటనలు కోకొల్లలు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పాలకవర్గ కౌన్సిల్ సభ్యులు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



ప్రధాన రహదారిపై సంచరిస్తున్న పశువులు

సైకిల్‌పై పట్టణంలో పర్యటిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్ (ఫైల్)

ఎంఇఒ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు, నాయకులు

చలో ఎంఇఒ కార్యాలయం

పార్వతీపురం రూరల్ : గిరిజన, మహిళా ఉపాధ్యాయులపై వివక్షత, కక్ష సాధింపు చర్యలకు చేపడుతున్న పార్వతీపురం ఎంఇఒ పివి ప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ యుటిఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం చలో ఎంఇఒ కార్యాలయం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మురళీమోహనరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల మధ్య తగువులు పెట్టి గ్రూపులు కట్టి తనకు నచ్చిన వారి పనులు, సమస్యలను పరిష్కరిస్తూ, నచ్చని వారి సమస్యలను పరిష్కరించకుండా వేధిస్తూ తిప్పుతున్నారని అన్నారు. మండల విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని, గిరిజన, మహిళా ఉపాధ్యాయులను వేధిస్తూ, వివక్షత చూపుతున్న ఎంఇఒపై సుమోటోగా కేసు నమోదు చేయాలని అన్నారు. డిఇఒ, ఆర్‌జెడి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిచో డిఇఒ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేపడతారని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు వి.జ్యోతి, జిల్లా కార్యదర్శులు కె.భాస్కరరావు, ఎన్.శ్రీనివాసరావు, పి.వెంకటినాయుడు, కె.మురారి, మండల నాయకులు వి.వసంతనాయుడు, బి.జగన్నాధం పాల్గొన్నారు .

చిరుధాన్యాల సాగు పెంచాలి : ఎంపిపి

గుమ్మలక్ష్మీపురం : గిరిజన రైతులు చిరుధాన్యాలు సాగు విస్తీర్ణంపై దృష్టి సారించాలని ఎంపిపి కె.దీనమయ్య అన్నారు. మండలంలోని రాయగడ జమ్ములో సోమవారం ఆదితల్లి రైతు ఉత్పత్తిదారుల సంఘ సభ్యుల విధులు, బాధ్యతలు, చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెంచాలని, కొర్రలు, సామలు, రాగులు, జొన్నలు, సజ్జలు, ఆరికలు మొదలగు పంటలు వేసుకొని ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండించి అధిక దిగుబడులు సాధించాలని అన్నారు. చిరు ధాన్యాలు ఉపయోగించకపోవడంతో 50ఏళ్లలోపే మరణాలు సంభవించడం బాధాకరమన్నారు. ప్రకృతి వ్యవసాయానికి జట్టు సంస్థ చేస్తున్న కార్యక్రమాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. ఎఫ్‌పిఒ సభ్యులకు ఒక్కొక్కరికి కేజీ చొప్పున కొర్ర బియ్యం అందించారు. చిరు ధాన్యాలతో ఎన్ని రకాల వంటలు తయారు చేయవచ్చో రిసోర్స్‌పర్సన్ మురహరిరావు చేసి చూపించారు. కార్యక్రమంలో జట్టు వ్యవస్థాపకులు డి.పారినాయుడు, బిసి రజక కార్పొరేషన్ డైరెక్టర్ జి.గిరిబాబు, వైస్ ఎంపిపి లక్ష్మణరావు, జట్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజు, డైరెక్టర్ నూకం నాయుడు ఉన్నారు.

పెదపెంకిలో పారిశుధ్య పనులు

బలిజిపేట : మండల లోని పెదపెం కిలో సోమవారం పారిశుధ్య పనులు ఆ గ్రామ సర్పంచ్ నగిరి పాపారావు సమక్ష లో శరవే గంగా జరుగుతున్నాయి. కాలువల్లో పూడికలు తీసి, సుమారు మూడున్నర అడుగుల లోతుల కాలువలు నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. గ్రామంలోని కాపువీధి (ఎన్‌టిఆర్ కాలనీ)లో ఈ పనులు జరుగుతున్నాయి. రూ.3లక్షల 50వేలుతో పెద్ద కాలువ పనులు, వాటర్ ట్యాంక్ నుంచి బిఎస్‌ఎన్‌ఎల్ టవర్ వరకు రూ.3లక్షలతో సిసి రోడ్ పనులు, ఎన్‌టిఆర్ కాలనీలో మరో రెండు కల్వర్టుల నిర్మాణాలకు ప్రణాళికలు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

దేవానంద్‌కు ఘన సన్మానం

గుమ్మలక్ష్మీపురం : తిరుపతి మహతి కళాక్షేత్రంలో శ్రీ శ్రీ కళావేదిక, ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల్లో శ్రీకాకుళం సాహితీ చైతన్య కిరణాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలక దేవానంద్‌ను ఘనంగా సన్మానించారు. అధ్యక్షులు డాక్టర్ భోగెల ఉమామహేశ్వరరావు (ఉమాకవి), శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ డా.కత్తిమండ ప్రతాప్ చేతుల మీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా సభలకు హాజరైన “శరత్కవి” డబ్బీరు వెంకటరమణమూర్తి, తుంబలి పట్టాభిరాం పట్నాయక్, తెప్పల కృష్ణమూర్తి, కడలి ప్రకాశరావు తదితర ప్రముఖ కవులు వీరిని అభినందించారు. వెంకటేశ్వరుడి వైభవంపై కవిత చదివినందుకు ఉమామహేశ్వరరావును, మాయమైపోతున్నాడమ్మా అనే పాటను పాడినందుకు దేవానంద్‌కు ఈ సందర్భంగా సాహిత్య గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్, మెమెంటో అందజేశారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

వీరఘట్టం : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం వైద్యాధికారి పి ఉమామహేశ్వరి 32 మంది గర్భిణులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపోటు, మధుమేహ, ఎత్తు, బరువు తదితరమైన తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ప్రధానమంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఓ. శాంతకుమారి ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మే 30న పండుగ

పార్వతీపురం టౌన్ : పార్వతీపురం గ్రామ దేవత ఇప్పలపోలమ్మ పండగను మే 30న నిర్వహిస్తున్నట్టు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. సోమవారం కమిటీ సభ్యులు నాయుడు వీధి వద్ద ఉన్న అమ్మవారి గుడి నుంచి బయలుదేరి రాజుగారి కోట వద్ద చాటింపు వేయించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఈనెల 17న అమ్మవారిని తీసుకురావడం జరుగుతుంది. మే 28న ఉయ్యాల కంబాల, 29న తొలేళ్ళ ఉత్సవం, 30న అమ్మవారి అనుపొత్సవం జరుగుతుందని తెలిపారు. ఈ పండగ నిర్వహించేందుకు అన్ని వర్గాల ప్రజలు సహాయ సహకారాలు అందజేయాలని కోరారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

స్పందన ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలు క్షుణంగా విని, ఫిర్యాదులను పరిశీలించి సంబందిత పోలీస్ అధికారులతో మాట్లాడి ఫిర్యాదులపై చట్టపరంగా విచారణ జరిపి, భాదితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వ్యక్తి పదే పదే పోలీసు స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఉండకూడదన్నారు. చట్టపరిధిలో సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చెయ్యాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలు స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ జరిపి నిర్ణిత గడువులోపు పరిష్కరిస్తామని ఆయన తెలిపారు. వివిధ సమస్యలతో 10 మంది ఫిర్యాదుదారులు ఆయనకు వినతులు అందించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి డాక్టర్ ఒ. దిలీప్ కిరణ్, ఎస్‌బి సిఐ ఎన్. శ్రీనివాస రావు , డిసిఆర్‌బి ఎస్ఐ. పి. దినకర్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి పండగకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

పార్వతీపురంటౌన్ : పట్టణంలో మే 30న ఇప్పల పోలమ్మ, ఎర్ర కంచమ్మ, పండగలు జరుగుతున్న సందర్భంగా మౌలిక సదుపాయాలు కల్పించాలని సిఐటియు నాయకులు గొర్లి వెంకటరమణ, పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి పాకల సన్యాసిరావులు కోరారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పలమ్మతల్లి, ఎర్రకంచెమ్మ తల్లి పండగల సందర్భంగా పండగలను వీక్షించేందుకు వస్తున్న లక్షలాది ప్రజలకు కనీస మౌలిక సౌకర్యాలు కల్పించి, వాటిని మెరుగుపర్చాలని కోరారు. ప్రస్తుతం పట్టణంలో తాగునీరు సక్రమంగా ఇవ్వడం లేదని, పారిశుధ్య నిర్వహణా పనులు అంతంతమాత్రంగానే ఉన్నాయని అన్నారు. అలాగే మేలో జరగబోవు గ్రామదేవతల పండగ సందర్భంగా ఈ మౌలిక సదుపాయాలు కల్పించి సమస్య పరిష్కారం చేయాలని కోరారు.

పార్వతీపురం రూరల్: బాధితులతో మాట్లాడుతున్న ఎస్‌పి విద్యాసాగర్

ట్రాన్స్ జెండర్ల కోసం ప్రత్యేక క్లినిక్ ఏర్పాటు

కురుపాం : ట్రాన్స్ జెండర్ల కోసం ప్రత్యేక క్లినిక్‌ను ఏర్పాటు చేయాలని హిజ్రాస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎ.గీతారాణి జిల్లా మలేరియా నివారణ అధికారి డాక్టర్ శ్యామ్ కుమార్‌కు వినతిని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించడానికి వచ్చిన శ్యామ్ కుమార్‌ను కలిసి తాము సుమారుగా 400 మంది ట్రాన్స్ జెండర్లు ఉన్నామని, తమ సమస్యలు చెప్పుకొని తమకోసం ప్రత్యేక క్లినికులు ఏర్పాటు చేయాలని కోరారు.

రేషన్ ఇప్పించండి

పార్వతీపురం రూరల్ : తమకు నెల నెలా క్రమం తప్పకుండా రేషన్ సరుకులు ఇవ్వాలని సాలూరు మండలం కొదమ పంచాయతీ గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ తమకు సక్రమంగా రేషన్ సరుకులు ఇవ్వడం లేదని పిఒకు వివరించారు. స్పందించిన పిఒ పౌరసరఫరా అధికారులను పిలిపించి తక్షణమే గిరిజనులకు రేషన్ సరుకులు అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఎటువంటి సమస్యలు లేకుండా సక్రమంగా రేషన్ సరుకులు అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన నాయకులు పాలక రంజిత్ కుమార్, సీదరపు కొమ్ములు, సింగూరు, వెంకటి, బుల్లి బాబు, మాలతీదొర, శ్రీహరి పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలి

సాలూరు : పట్టణంలోని బంగారమ్మ కాలనీలో సర్వే నెంబర్ 216-2లో ఉన్న 30 సెంట్ల ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ సోమవారం సిపిఎం, సిపిఐ, జనసేన నాయకులు తహశీల్దార్ కె.రామస్వామికి సోమవారం వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు డి.పండు, సిపిఐ సీనియర్ నాయకులు ఎస్.రామచంద్రరావు, జనసేన నాయకులు రేగు మహేష్ ఆధ్వర్యాన కొంతమంది కాలనీవాసులు తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురి కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ హెచ్.శంకరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. మున్సిపల్ అవసరాల కోసం నిర్దేశించబడిన భూమికి రక్షణ కల్పించాలని కోరారు.

సీతంపేట: ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న పిఒ నవ్య

జీతాలు ఇప్పించాలి

సీతంపేట : వైటిసి సిబ్బందికి 17 నెలలుగా జీతాలు చెల్లించలేదని జీతాలు ఇప్పించాలని వై.టి సిబ్బంది రమేష్, శ్రీనివాసరావు తదితరులు వినతి సమర్పించారు. సోమవారం స్పందన కార్యక్రాన్ని పిఒ బి నవ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. కోడిశ గ్రామానికి చెందిన కామేశ్వరరావు విద్యుత్ తీగల మార్చాలని విన్నవించారు. మణిగ గ్రామానికి చెందిన మంగ బిఎస్ఎన్ఎల్ టవర్ పనులు ప్రారంభించాలని, గొట్ట లక్ష్మీపురానికి చెందిన రమణమ్మ కొండ చీపురుల లోను ఇప్పించాలని, సూదిరాయి కొండకు చెందిన సురేష్ నాటు కోళ్ల ఫారంకు ఆర్థిక సహాయం అందించాల, శంభం గ్రామానికి చెందిన ఓయిక వినిత సిఆర్‌టి పోస్ట్ ఇప్పించాలని, గోయిది గ్రామానికి చెందిన కుమారి కుట్టు మిషన్ ఇప్పించాలని కోరారు. ఈ స్పందన కార్యక్రమానికి 23 వినతులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. మురళి డిఎం సంధ్యారాణి, సిడిపిఒ రంగలక్ష్మి, ఎడ్యుకేషన్ ఓఎస్‌డి యుగేందర్, ఎఎంఒ కోటి బాబు, ఎపిడి శ్రీహరి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి

పాలకొండ : తాగునీటి సమస్య పరిష్కరించాలని నగర పంచాయతీలోని రెల్లి వీధి ప్రాంతీయులు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కార్యాలయ ఏవో సావిత్రికి వినత పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక 2 వార్డులో ముఖ్యంగా రెల్లివీధి ప్రాంతంలో తాగునీరు సమస్య చాలా ఇబ్బందికరంగా ఉందని, నేటికీ 15 రోజులు కావస్తున్నా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. నగర పంచాయతీ అధికారుల దృష్టికి కూడా తీసుకొని వెళ్ళడం జరిగిందని, అయినా ఇంతవరకు తాగునీటి సమస్య పరిష్కారం కాలేదని చెప్పారు. నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

జిల్లా వ్యాప్తంగా కోవిడ్ మాక్ డ్రిల్

పార్వతీపురం/సీతంపేట/కురుపాం

జిల్లా వ్యాప్తంగా కోవిడ్ మాక్ డ్రిల్ సోమవారం నిర్వహించారు. కోవిడ్ వ్యాప్తి పట్ల ప్రజలను అప్రమత్తం చేయడం, ఎటువంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం అనే సందేశాన్ని అందించే భాగంగా దీన్ని నిర్వహించారు. ఈ మేరకు జిల్లాలో గల సిహెచ్‌సిలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా హాస్పిటల్ లో కోవిడ్19 మాక్ డ్రిల్‌లను జరిపారు. అందులో భాగంగా జిల్లా వైద్యఆరోగ్యఅధికారి డాక్టర్ బగాది జగన్నాథ రావు జిల్లా హాస్పిటల్‌ను సందర్శించారు. కోవిడ్ సమయంలో అవసరమైన ఆక్సిజన్ ప్లాంట్లు, వెంటిలేటర్లు, అవసరమైన చికిత్స చేయడానికి కావాల్సిన మందుల అందుబాటును సమీక్షించారు. ఐసియు బెడ్‌ల పనితీరును ఆరా తీశారు. వైద్యులు, స్టాఫ్ నర్స్‌లకు కోవిడ్‌పై అవగాహనను పరిశీలించారు. కోవిడ్ వ్యాప్తి చెందకుండా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, మాస్కు తప్పని సరిగా ధరించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రత, వైద్యపరీక్షలు చేయించుకోవాలని పేర్కొ న్నారు. జిల్లా హాస్పిటల్‌లో మొత్తం 150 బెడ్లు ఉండగా అందులో ఆక్సిజన్ బెడ్లు 129, ఐసియు బెడ్లు 15, 6 వెంటిలేటర్ బెడ్లు ఉన్నట్టు నిర్ధారించారు. 17 వెంటిలేటర్లు, 9 నెబులైజర్లు, 60 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు, 255 ఆక్సిజన్ సిలిండర్లు, పిఎస్ఎ, ఆక్సిజన్ స్టోరేజ్ టాంక్ పని చేస్తున్నన్నట్టు నిర్ధారించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వాగ్దేవి, డిస్ట్రిక్ట్ ఎపిడేమియోలజిస్ట్ డా.నవీన్ కుమార్, అనస్థీషియా డా.ధనుంజయ్, ఆర్ఎంఒ డా.శేషగిరిరావు పాల్గొన్నారు.

కోవిడ్ -19 మాక్ డ్రిల్ లో భాగంగా చినమేరంగి సిహెచ్‌సిని ఆర్‌బిఎస్‌కె పిఒ డాక్టర్ ధవళ భాస్కరరావు, కురుపాం సిహెచ్‌సిని జిల్లా మలేరియా అధికారి టిబి నివారణ అధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్, సీతంపేట ఏరియా ఆసుపత్రిని డెప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయ పార్వతి, భద్రగిరి సిహెచ్‌సిని ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్ కుమార్ సందర్శించారు.

పార్వతీపురం: బెడ్‌లను పరిశీలిస్తున్న డిఎంఅండ్‌హెచ్ఒ

మలిదశ ఉద్యమం ప్రారంభం

పార్వతీపురం రూరల్ : మలిదశ ఉద్యమకార్యాచరణలో భాగంగా ఎపి జెఎసి అమరావతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి.శ్రీరామ్మూర్తి, డిజి ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ నిశాంత్ కుమార్‌ను కలిసి వినతి అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంగళవారం జరిగే సెల్ ఫోన్ డౌన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క ఉద్యోగి తమ ఫోన్లను బందు చేసి జెఎసికి సహకరించాలని కోరారు. అలాగే బుధవారం జరిగే ధర్నా కార్యక్రమంలో జిల్లాలోని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని పిలుపునిచ్చారు. మలిదశ ఉద్యమంలో భాగంగా రాష్ట్ర జెఎసి ఇచ్చిన కార్యాచరణ విజయవంతంగా అమలు చేసి ప్రభుత్వానికి మన నిరసన తెలియజేసేందుకు అంకితభావంతో ఉద్యమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని కోరారు.

మాజీ సర్పంచ్ పెద అప్పలనాయుడు మృతి

వీరఘట్టం : మండలం రేగులపాడు మాజీ సర్పంచ్ మెరుగుల పెద అప్పలనాయుడు(81) సోమవారం మృతి చెందారు. కొద్దిరోజులు నుండి అనారోగ్యానికి గురై ఆయన తుది శ్వాస విడిచినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈయనకు భార్య యశోదమ్మ, కుమారులు మెరుగుల ఉమామహేశ్వరరావు, చంద్రమౌళేశ్వరరావు, రమేష్ ఉన్నారు. రెండో కోడలు మెరుగుల భవానమ్మ ప్రస్తుతం సర్పంచ్ గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

రైతులను ఆదుకోవాలి

కొమరాడ: అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి కోరారు. ఈ మేరకు స్థానిక తహశీల్దార్ రాధాకృష్ణకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు సాంబ మూర్తి, ఎ.ఉపేంద్ర మాట్లాడుతూ మండలంలో గడిచిన కొన్ని రోజులుగా భారీ గాలులు, వడగళ్ల వానలకు మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న, టమాట, బొప్పాయి, అరటి, జీడి, నువ్వు తదితర పంటలకు బాగా నష్టం వాటిల్లిందన్నారు. వెంటనే అధికారులు ఈ పంటలకు సంబంధించిన నష్టాన్ని గుర్తించి అన్ని పంటలకు నష్టపరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇలాంటి సందర్భంలో అటు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు నష్టాన్ని గుర్తించి రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతు శీరామునాయుడు పాల్గొన్నారు.

29 నుంచి మహాసంప్రోక్షణ

సీతంపేట : స్థానిక శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ఏప్రిల్ 29 నుంచి మే 4వ వరకు జరగనున్నాయని టిటిడి జెఇఒ వీరబ్రహ్మం తెలిపారు. మహా సంప్రోక్షణ ఏర్పాట్లను ఐటిడిఎ పిఒ బి.నవ్య, టిటిడి అధికారులతో కలసి సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జెఇఒ మాట్లాడుతూ శ్రీవారి వైభవాన్ని నలుదిశలా వ్యాప్తి చేసేందుకు దేశంలోని ప్రముఖ నగరాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోనూ టిటిడి స్వామివారి ఆలయాలు నిర్మిస్తోందన్నారు. ఇందులో భాగంగా గిరిజన ప్రాంతమైన సీతంపేటలో శ్రీవారి ఆలయాన్ని చక్కగా నిర్మించినట్లు చెప్పారు. మే 4వ తేదీ నుంచి ఇక్కడ భక్తులకు స్వామివారి దర్శనం ప్రారంభిస్తామన్నారు. ఆలయ సమీపంలోని కల్యాణ మండపాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. పరిసర ప్రాంతాల భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు. పిఒ నవ్య మాట్లాడుతూ టిటిడి ఆధ్వర్యంలో గిరిజన ప్రాంతంలో శ్రీవారి ఆలయం నిర్మించడం ఇక్కడి ప్రజల అదృష్టమన్నారు. మహాసంప్రోక్షణ అనంతరం ఆలయంలో స్వామివారిని దర్శించుకోవాలని, కల్యాణ మండపాన్ని స్థానిక గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి వచ్చే అర్చకులు, ఇతర అధికారులు, సిబ్బంది, శ్రీవారి సేవకుల వసతి కోసం ఐటిడిఎ అతిథి గృహం, పాఠశాలలు పరిశీలించారు. ఆ తరువాత రాజాంలోని శ్రీవారి ఆలయాన్ని జెఇఒ ఇతర అధికారులు సందర్శించారు. టిటిడి చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, డిప్యూటీ ఈవో గుణభూషణ్ రెడ్డి, ఎస్ఇ (విద్యుత్) వెంకటేశ్వర్లు, విజిఒ మనోహర్, జిసిసి మేనేజర్ సంధ్యా రాణి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిటిడి జెఇఒ వీరబ్రహ్మం

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

పాలకొండ రూరల్ : స్థానిక పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బగాది జగన్నాథరావు సోమవారం తనిఖీ చేశారు. ఎక్కువ మంది ప్రజలు ఆరోగ్య కేంద్రం సేవలు వినియోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ప్రభుత్వం సరఫరా చేసిన అన్ని పరికరాలూ వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలూ చేయాలని ఆయన ఆదేశించారు. అందుకు కావలసిన అన్ని చర్యలూ తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజలకు దగ్గరలో మంచి వైద్యం అందాలని ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని పరికరాలు సమకూర్చుతోందని ఆయన చెప్పారు. దీనిని సక్రమంగా సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి, వైద్య సిబ్బంది యోగేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కెజిబివిని సందర్శించిన డిఇఒ

గుమ్మలక్ష్మీపురం : స్థానిక కస్తూరిబా పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్‌డివి రమణ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి విద్యార్థులు మిగిలిన మూడు సబ్జెక్టులపై దృష్టి సారించి బాగా చదవాలని, పరీక్ష రాసేటప్పుడు విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సలహాలు, సూచనలు ఇచ్చారు. నూటికి నూరు శాతం ఉత్తీర్ణత పొందిన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. సకాలంలో పరీక్ష కేంద్రాలకు హాజరుకావాలన్నారు. అనంతరం పాఠశాలలో అమలు చేస్తున్న మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. భోజనం, కూరలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీరంజని ఉన్నారు.

వైసిపిని ఆదరించకపోతే పేదలకే నష్టం

జగనన్నే మా భవిష్యత్తులో డిప్యూటీ సిఎం

ప్రజాశక్తి - సాలూరు

రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపిని ఆదరించకపోతే పేదప్రజలే నష్టపోతారని డిప్యూటీ సీఎం రాజన్నదొర అన్నారు. సోమవారం ఆయన మండలంలోని బాగువలస, దేవుబుచ్చింపేట, వల్లాపురం, చంద్రప్పవలస్ లో జగనన్నే మా భవిష్యత్తు, నమ్మకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి స్టిక్కర్లను అంటించి గత ప్రభుత్వానికి, వైసిపి ప్రభుత్వానికి ఉన్న తేడాను ఆమె వివరించారు. దేశంలో పేదల కోసం ఎక్కడాలేని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌దేనని చెప్పారు. మళ్లీ వైసిపి అధికారంలోకి వస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అమల్లోకి వస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, వైసిపి సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, జగనన్న సచివాలయాల మండల కన్వీనర్ కె.త్రినాథ నాయుడు, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ కె.మన్మధరావు పాల్గొన్నారు.

జియమ్మవలస: జగనన్న నువ్వే మా నమ్మకం కార్యక్రమం మండలంలోని కొండచిలకాం పంచాయతీలో నిర్వహించారు. వైసిపి నాయ కులు అప్పారావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాల తీరును ప్రజలకు వివరించారు.

భామిని : లివిరి పంచాయతీలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు, మండలం జెసిఎస్ కన్వీనర్ కొత్తకోట చంద్రశేఖర్, పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, సోమరాజు గోపాలరావు ఆధ్వర్యంలో, పెద్దిదిమిలి గ్రామంలో సర్పంచ్ తోఫురానా శ్రీను ఆధ్వర్యంలో, లోహరిజోల గ్రామంలో సర్పంచ్ భైరగి, వైసిపి నాయకులు పిరపాక శ్రీను ఆధ్వర్యంలో ఇంటింటి వెళ్లి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసిపి నాయకులు కొత్తకోట ఆంజనేయులు, కాగితపల్లి కృష్ణ, మెడిబోయిన చలపతి రావు, సచివాలయం కన్వీనర్లు, గృహ సారధులు, వాలంటీర్లు, వైసిపి కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలో నిడగల్లు, వెంకటాపురంలో స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు సారధ్యంలో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం చేపట్టారు. నియోజకవర్గ పరిశీలకులు శోభా హైమావతి పాల్గొనగా, సచివాలయం కన్వీనర్లు, గహసారథులు, వైసిపి నాయకులతో కలిసి గ్రామాల్లో ఇంటి ఇంటికి వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకొని వారికి వైసిపి ప్రభుత్వం చేకూరిన లబ్ధి, పొందిన ప్రయోజనాలతో పాటు గత ప్రభుత్వంలో మోసపోయిన, మోసగించిన విధానాన్ని విడమరిచి రెండు ప్రభుత్వాలకు మధ్య ఉన్న వ్యత్యాసం ఏమిటి అన్నది వివరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మామిడి బాబ్జీ, ఎంపిపి ప్రతినిధి బలగ శ్రీరాములు నాయుడు, వైస్‌ఎంపిపి టి.సూర్యనారా యణ, మండల అధ్యక్షులు బొంగు చిట్టిరాజు, సర్పంచులు మర్రాపు ధనుంజయ్, బుడితి శ్రీనివాసరావు, బి.తిరుపతిరావు, కురమాన శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు పోల ఈశ్వరనారాయణ, జి.శ్రీను, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

సాలూరు: ఇంటికి స్టిక్కరు అతికిస్తున్న డిప్యూటీ సిఎం రాజన్నదొర

స్నేహితుని మృతదేహాన్ని చూసేందుకు వస్తూ...

తిరిగిరాని లోకాలకు..!

మృతిచెందిన వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్నేహుతుని మరణవార్త విని చూసేందుకు వచ్చిన ఓ వ్యక్తి ప్రమాదవ శాత్తూ మరణించాడు. స్థానిక రైల్వేస్టేషన్‌లో సోమ వారం జరిగిన ఈ సంఘటన కుటుంబ సభ్యులను, స్నేహితులను, చూపరులను తీవ్రంగా కలచివేసింది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పార్వతీపురం మన్యం జిల్లా సీతానగరం మండలం పూనిబుచ్చంపేట గ్రామానికి చెందిన మర్రి రమణ మరణించాడు. ఆయన కుమార్తె స్వాతి పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో డిగ్రీ చదువుతోంది. రమణ భౌతికకాయాన్ని చూసేందుకు పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండ మండలం కాకిలేరు గ్రామానికి చెందిన ఆయన స్నేహితుడు ఉన్నమట్ల వెంకటేశ్వరరావు(46)... పాలకొల్లులో ఉన్న స్వాతిని తీసుకుని వస్తున్నాడు. తిరుపతి నుంచి బిలాస్‌పూర్ వెళ్తున్న రైలులో వస్తూ బొబ్బిలి రైల్వేస్టేషన్లో దిగుతుండగా ప్రమాదవశాత్తు జారిపడటంతో అక్కడికక్కడే వెంకటేశ్వరరావు మరణించాడు. స్నేహుతుని మృతదేహాన్ని చూసేందుకు వస్తూ వెంకటేశ్వరరావు మరణించడంతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. మృతుడు వెంకటేశ్వరరావు భార్య సునీత ఉపాధి కోసం మస్కట్‌లో ఉంటోంది. వెంకటేశ్వరరావుకు ఐదుగురు పిల్లలు ఉన్నారు. బొబ్బిలి రైల్వే పోలీసులు బి.ఈశ్వరరావు, శంకరరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

మక్కువ : మండలంలోని మక్కవ, సంబర రహదారిలోని ఎస్ఆర్ పురం సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ఇంకొకరికి తీవ్ర గాయాలయ్యాయి.. వివరాల్లోకి వెళ్తే..సాలూరు పట్టణం బంగారమ్మ కాలనీకి చెందిన నగిరి కటకం శివ (30) ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందగా సబ్బవరపు శంకర్ అనే యువకుడు తీవ్ర గాయాలు పాలయ్యాడు. గాయపడిన శంకర్‌ను మక్కువ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మక్కువలోని ఓ శుభకార్యానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో సంబరం మీదగా సాలూరు వెళుతుండగా బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైనట్లు తెలిసింది. సమాచారం అందుకున్న వెంటనే 108 సిబ్బంది చేరుకున్నప్పటికి ఆయన మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘటన స్థలంలో మృతి చెందిన శివ

యువకుడు ఆత్మహత్య

జియ్యమ్మవలస : మండలంలోని తాళ్లడుమ్మ గ్రామానికి చెందిన పట్నాన సోమేశ్వరరావు (38) సోమవారం తన ఇంట్లో ఉరివేసుకొని మృతి చెందినట్లు చిన్న మేరంగి ఎస్సై జి.కళాధర్ తెలిపారు. ఆయన మానసిక పరిస్థితి సరిగ్గా లేకపోవడం, మద్యానికి బానిసవ్వడంతో ఆత్మహత్య చేసుకున్నట్టు సోమేశ్వరరావు భార్య ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. ఆయనకు భార్యతో పాటు కుమార్తె, కుమారుడు కూడా ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా ఇద్దరికి తీవ్ర గాయాలు

సీతానగరం: మండలంలో నిడగల్లు - లక్ష్మి పురం రోడ్డు వెంకటాపురం సమీపంలో ట్రాక్టర్ అదుపు తప్పి పొలంలోకి దూసుకు వెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అందించిన వివరాలు ప్రకారం.. రాళ్ల క్వారీ నుండి లక్ష్మీపురం గ్రామానికి రాళ్లపిక్క లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపుతప్పి వెంకటాపురం గ్రామ సమీపంలో ఉన్న పొలాల్లోకి దూసుకు వెళ్లడంతో ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. ట్రక్కు పై కూర్చున్న పాపం వలస గ్రామానికి చెందిన సిల్ల మురళి ట్రక్కు కింద ఇరుక్కుపోయాడు. అదే ట్రాక్టర్‌పై ఉన్న పిల్ల గిరిబాబు ట్రక్కు బోల్తా పడే సమయంలో పైకి ఎగిరి కిందకు పడ్డాడు. స్థానికులు గమనించి ఇద్దర్నీ బయటికి తీశారు. 108 వాహనం సహాయంతో తీవ్ర గాయాలైన ఇద్దరిని పార్వతీపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కొట్లాటలో మహిళకు గాయాలు

పార్వతీపురం రూరల్ : స్థానిక పాత బస్టాండు సమీపంలో పక్కపక్కనే సైకిల్ షాపులు నిర్వహిస్తున్న సనపతి ప్రతాప్, నాగరాజు పిల్లల విషయమై చెలరేగిన వివాదంలో నాగరాజు కుటుంబం ప్రతాప్ భార్య జయలక్ష్మిపై దాడి చేయడంతో ఆమె గాయాల పాలైంది. పోలీసులకు ఫిర్యాదు చేయగా, సోమవారం ఆమెను జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.